

# కథ

మన్నె సత్యనారాయణ

# వసంత కోకిల

అసలు కోకిల మావయ్య వచ్చాడంటే మా అందరికీ సందడే! ఎవరి అభిలాషను బట్టి వాళ్లకు కబుర్లు చెబుతూ అందర్నీ ఉత్సాహపరుస్తూ ఉంటాడు. తాను నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ ఉంటాడు. చిన్నపిల్లల్తో ఆడతాడు. వయస్సులో ఉన్నవాళ్లతో సరసమైన మాటలు చెబుతూ ఉంటాడు అశ్లీలం లేకుండా! అందుకే అతనొస్తే మా అందరికీ ఆనందమే!

ఇంతకీ కోకిల మావయ్య మా అమ్మకు వేలు విడిచిన తమ్ముడు. కానీ సొంత తమ్ముడిలాగే చూస్తుంది అమ్మ. మేమూ అంతే!

అసలా పేరేంటి? కోకిల ఆడ పేరు, మావయ్య మగ వరస! అలా ఎందుకు పిలుస్తారూ! అతన్నే అడిగి తెలుసుకోవాలనిపించింది. బైటవాళ్లేమో కథలు చెబుతారతన్ని గురించి.

"మావయ్యా, నిన్నోటి అడుగుతాను. నిజం చెబుతావా?" అనడిగాను.

"ఎందుకనుకుంటానురా! ఏదైనా అడుగు" అన్నాడు.

"నీ పేరుకు ముందు 'కోకిల' అని ఎందుకంటారంతా?" అన్నాను.

"ఓహ్! అదో కథ! అందరికీ తెల్సిన కథేరా!"

"అందరూ చెప్పేదాంట్లో అతుకులూ, అతిశయోక్తులూ ఉంటాయి. నిజం నీకు మాత్రమే తెలుసు" అన్నాను.

"నా అసలు పేరు దొంకవలస సుబ్బారావు. మా అమ్మా నాన్నకు ఒక్కడ్నే. అప్పట్లో ఎస్.ఎస్.ఎల్.సి. ఫెయిలై చదువు మానేశాను. మాకు భూస్థితి బాగానే ఉండేది. కానీ పొలం వెళ్లి మా నాన్నకు సాయం చేసే వాడ్ని కాదు. శుభ్రంగా తెల్లని ఇస్త్రీ బట్టలు వేసుకునేవాడిని. కాళ్లకు బాటా చెప్పులు. వేళ్లకు ఉంగరాలు. అప్పట్లో ఇవన్నీ పల్లెటూళ్లలో లగ్జరీలే! గిరజాల జుట్టు. ఆడవాళ్ల దగ్గరా, మగవాళ్ల దగ్గరా కూర్చుని కబుర్లు చెప్పేవాడిని."

"అయితే అప్పుడు నీవు చాలా పాపులర్ అన్న మాట!" అన్నాను నవ్వుతూ.

"పెద్దవాళ్లంతా నన్ను నీటు సుబ్బారావనేవారు. ఆ రోజుల్లో గిరజాల జుట్టు అందమూ, షోకూను. వయస్సులో ఉన్న ఆడపిల్లలు నన్ను షోకు సుబ్బారావనేవారు. పెద్ద వయసు ఆడవాళ్లు 'గోటు' సుబ్బారావనేవారు."

"అబ్బో! చాలా పేర్లే నీకు!" అన్నాను.

"ఇలా బాధ్యత లేకుండా తిరిగేవాడ్ని. సరిగ్గా ఆ రోజుల్లోనే మా ఊరి బడికి పేరయ్య మాస్టారు వచ్చారు. వారి పెద్దమ్మాయి పేరు కోకిల..."

"అమ్మయ్యా! అసలు కథకిప్పుడొచ్చావు!" అన్నాను.

"అసలు కథ ఎప్పుడూ మధ్యలోనే మొదలవుతుంది. జీవితంలో కూడా అంతే. కోకిల పదవ తరగతి ఫెయిలై చదువు మానేసింది."

"మీరిద్దరూ ఫెయిల్డ్ కాండిడేట్స్ అన్నమాట!"

"మాలాంటివాళ్లం సగటు మేధావులం"

"ఏంటీ సగటు మేధావులా! కొత్త మాట? మంచి మాట!" అన్నాను.

"నిజమెప్పుడూ మంచిమాటే అవుతుంది. కోకిల చుట్టుపక్కల ఇళ్లల్లోని ఆడవాళ్ల దగ్గర కూర్చుని కవుర్లు చెబుతూ ఉండేది. మాటల్లో దిట్ట! వట్టి వాగుడుకాయ! మా అమ్మకామంటే చాలా ఇష్టమేర్పడింది. అందుకే, మా ఇంటికి ఎక్కువగా వచ్చేది..."

"అయితే మీ ఇద్దరికీ మంచి అవకాశమే ఏర్పడిందన్నమాట."

"అప్పుడే కాదు. ప్రేమ కథంత తొందరగా మొదలవ్వదు. సందర్భం రావాలి. నాకు నాటకాల పిచ్చి. అప్పుడెక్కువగా పౌరాణిక నాటకాలాడేవారు. అందరూ ఉద్దండులైన నటులు! చుట్టుపక్కల ఏ ఊళ్లో నాటకమేస్తున్నా తప్పకుండా వెళ్లి చూసేవాడ్ని. వాటిలో నాకు చెల్లియో చెల్లకో, జెండాపై కపిరాజు, మీరజాలగలడా నా యానతి మొదలైన పద్యాలంటే చాలా ఇష్టం."

"అయితే, నీవు కూడా నాటకాలు వేసేవాడివా?"

"లేదు. కానీ వాటిలోని పద్యాలు, పాటలూ పాడేవాడిని. ఒకనాడు మా ఇంట్లో గదిలో కూర్చుని "చెల్లియో చెల్లకో..." అనే పద్యం నెమ్మదిగా పాడుకుంటున్నాను. నా పద్యం పూర్తి అయిన వెంటనే మళ్లీ "చెల్లియో చెల్లకో..." అనే పద్యం ప్రారంభమయ్యింది. ఆశ్చర్యంగా బైటకొచ్చి చూశాను. మా ఇంటి చావిట్లో బల్లమీద కూర్చుని కోకిల గొంతు విప్పి పాడుతున్నది. శ్రావ్యంగా అద్భుతంగా పడుతోంది. పాడటం పూర్తి కాగానే నేను నాటక పక్కీలో 'ఒన్స్‌మోర్' అన్నాను. ఆమె కూడా నాటక ఫక్కీలోనే అదే పద్యాన్ని మళ్లీ పాడింది. 'కోకిల పుట్టినప్పుడే ఓ చిన్న పాట పాడిందేమో! అందుకే వాళ్లు 'కోకిల' అని ఆమెకు పేరు పెట్టి ఉంటారనుకున్నాను" ఆమె గలగలా మాట్లాడుతున్నప్పుడు కూడా మధురంగా ఉంటుందామె కంఠం!

ఆ తర్వాత ఇద్దరం నాటకాల గురించి మాటాడుకున్నాం. ఆమె కూడా నాటకాల పిచ్చిది. ఏక్టర్ల గురించి వాళ్ల పుట్టుపూర్వోత్తరాల గురించీ, వాళ్ల అలవాట్ల గురించీ ఆమెకు వివరించి చెప్పేవాడిని. ఎంతో శ్రద్ధగా వినేది. ఆ విధంగా మా ఇద్దరిదీ పరిచయం, చనువు ఎక్కువయ్యాయి. ఆత్మీయులమైనాం. అయితే మేమెప్పుడూ పరిమితులు దాటలేదు. ఎక్కువగా మా అమ్మ సమక్షంలోనే మాట్లాడుకునేవాళ్లం. కోకిల క్రమంగా ఇతరుల ఇళ్లకెళ్లడం తగ్గించింది. మా ఇంటికి వచ్చేది.


అయితే, మా ఇద్దరి మధ్యా ప్రేమ ఉందని అందరూ చెప్పుకునేవారు. అప్పట్నుంచీ, నా స్నేహితులు నన్ను కోకిల-సుబ్బారావు అనేవారు. అదే క్రమక్రమంగా కోకిల సుబ్బారావుగా పిలవడం పరిపాటయ్యింది.

"మరి మీ అమ్మకివన్నీ తెలియదా?" అనడిగాను.

"తెలిశాయి. అయితే మేమెలా ఉంటున్నామో అమ్మకు తెలుసు. ఇంతలో నాకు పెళ్లి సంబంధాలు రావడం మొదలైంది. నాకు చదువంతగా లేకపోయినా, ఆస్తి ఉంది కనుక మంచి సంబంధాలే వచ్చేవి. అప్పుడు నాకో ఆలోచన వచ్చింది. వాళ్లనీ వీళ్లనీ చూడ్డమెందుకు? కోకిలనే చేసుకుంటే బావుంటుంది కదా అనిపించింది. ఆ విషయం మా అమ్మతో అన్నాను.

అమ్మ మందలించింది. "మీ ఇద్దరికీ పెళ్లెలా కుదురుతుంది? ఆమె బ్రాహ్మల పిల్ల. మనం వ్యవసాయదారులం" అంది.

ఒకనాడు కోకిల వచ్చినపుడు ఆమెతో పెళ్లిమాట



అన్నాను. ఆమె ఎగిరి గంతేసింది.

"నిజంగా నన్ను చేసుకుంటావా?" అంది. "మరి మీరు బ్రాహ్మలు కదా! మీవాళ్లొప్పుకుంటారా?" అన్నాను.

"నేనెలాగోలాగు ఒప్పించుకుంటాను" అంది.

"వాళ్లొప్పుకుంటే సరే" అంది మా అమ్మా.

ఆ తర్వాత, కోకిల వాళ్లమ్మా నాన్నతో అన్నదంట. వాళ్ల నాన్న కేకలు వేశారంట. వాళ్లమ్మ కులభ్రష్టం చేస్తావుటే అని నానా తిట్లూ తిట్టిందంట. కోకిలను ఎక్కడికీ వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు.

ఓ వారం రోజుల తర్వాత తెలిసింది కోకిలను వాళ్ల పినతండ్రిగారి దగ్గరకు మద్రాసు పంపించేరంట. వెళ్లి కలుద్దామన్నా, ఉత్తరం వ్రాద్దామన్నా వాళ్ల అడ్రసు తెలియదు. నాకు దిగులు పట్టుకుంది. ఆ తర్వాత రెండు నెలల్లో పేరయ్య మేస్టారు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మా ఊర్నుంచి వెళ్లిపోయారు.

★ ★ ★

ఆరు నెలలు గడిచిపోయాయి. ఆమె సమాచారం తెలవడం లేదు. ఎంత ప్రయత్నం చేసినా కూడా "నేనప్పుడే చెప్పాను కుదరదని. ఆ పిల్లను మరచిపో. పెళ్లి చేసుకో" అని మా అమ్మ అనేకసార్లనేది. నేనేమీ మాట్లాడకుండా దిగులుగా ఉండేవాడిని.

ఒకసారి మా అమ్మకు స్నేహితురాలైన విశాలత్తయ్య విజయవాడ ఓ పెళ్లికెళ్లింది. అక్కడ కోకిల అమ్మగారు కనిపించారట. కోకిలకు పెళ్లయిందని, భర్త ఇంజనీరని, మద్రాసులో ఉంటున్నారని చెప్పారటావిడ. విశాలత్తయ్య ఆ మాటలు మా అమ్మతో చెప్పింది. పేరయ్య మేస్టారుకు సొంత భూములు కూడా ఉన్నాయి కదా. మంచి కట్నమే ఇచ్చి చేశారంట. మంచి సంబంధమే అని చెప్పింది.

నాకంతా శూన్యంగా అనిపించింది. అమ్మ కూడా బాధ పడింది. నా స్నేహితులొచ్చారు. నన్ను "అయినా

ఆ పిల్ల ఏం బావుంటుంది? నల్లగా ఉంటుంది కదా, కోకిల లాగే" అన్నారు. ఆమె అందం గురించి నేనెన్నడూ ఆలోచించలేదు. ఆమె అమాయకత్వం, నా యెడల ఆమెకు గల నిబద్ధతా, ఆత్మీయతలు నన్నామెకు బద్ధుడను చేశాయి.

నిస్పృహలో ఉంటున్న నన్ను మా అమ్మ బ్రతిమాలింది. "కోకిలకు పెళ్లయిపోయింది. ఇప్పుడు మనమేం చేయలేం. ఇలా ఎన్నాళ్లుం టావు? మా గురించి కూడా ఆలోచించు" అంది. చివరలో నేను పెళ్లికి సరేనన్నాను. ఒక మంచి సంబంధం చూసి నాకు పెళ్లి చేశారు.

"నీకు పెళ్లి చేసినవాళ్లకీ ప్రేమ వ్యవహారం తెలుసా?" అనడిగాను.

"తెలియదురా. కానీ పెళ్లి తర్వాత నేను నా భార్యకంతా వివరంగా చెప్పాను. ఆమె చాలా మంచిది. ఈర్ష్య పడలేదు. నన్ను నిందించలేదు. బాగా అర్థం చేసుకుంది. అదొక అదృష్టం" అన్నాడు మావయ్య తృప్తిగా.

* * *

అలా నాలుగైదు సంవత్సరాలు గడిచిపో యాయి. నేను కూడా కొత్త జీవితంలో సమా ధానపడుతున్నాను. ఊళ్లో స్నేహితులు నన్ను అప్పటికీ నన్ను 'కోకిల సుబ్బారావు' అంటూనే ఉన్నారు. ఒకనాడు ఒక ఆహ్వాన పత్రిక వచ్చింది. రాజమండ్రిలో ఒక ఆశ్రిత శరణాలయం వారిది. వార్షికోత్సవ సభ క్రింద నిర్వాహకురాలు 'కోకిల' అని ఉంది. ఆశ్చర్యం వేసింది నాకు. కోకిల రాజమం డ్రిలో ఉండడమేంటి? ఆమె భర్త మద్రాసులో ఇంజనీరు కదా! ఆమె రాజమండ్రిలో ఎందు కుంటున్నది? నాకేమీ అర్థం కాలేదు. మా అమ్మకూ, నా భార్యకూ చూపించాను. వాళ్లూ నాలాగే ఆశ్చర్యపడ్డారు. "ఓసారి వెళ్లి చూసిరా. అంతా తెలుస్తుంది" అంది అమ్మ.

వార్షికోత్సవం నాటి ఉదయం రాజ మండ్రి వెళ్లాను. శరణాలయం లోపల మంచి ఖాళీ స్థలముంది. ఒక వైపున మూడు నాలుగు పొడవాటి షెడ్లు వేశారు. వాటిలో గదులు వేశారు. వాటిలో ఆశ్రితులైన స్త్రీలుంటున్నారు. మధ్యలో ఒక వైపు పూలమొక్కలూ, మరో వైపున కూరగాయల మొక్కలు ఉన్నాయి. మధ్యలో ఒక వేదికను తాత్కాలికంగా వార్షికోత్సవం కోసం వేశారు. రెండో వైపున, కాస్త దూరంగా ఒక చిన్న పెంకు టిల్లుంది.

కోకిలగారెక్కడుంటారని అక్కడ పని చేస్తున్న ఒకరినడిగాను. ఆ చిన్న పెంకు టిల్లు చూపిందావిడ. అటువైపు నడి చాను. ఇంటిగుమ్మం ముందు కోకిల నిలబడి ఉంది. నా కోసమే చూస్తున్నట్లుగా అనిపించింది. చిరునవ్వుతో నన్నాహ్వానించి లోనికి తీసుకెళ్లింది. మధ్య హాలులో కుర్చీలున్నవి. ఒక కుర్చీలో కూర్చున్నాను. నా ఎదు రుగా ఉన్న కుర్చీలో తను కూర్చుంది. ఆమె వంక చూస్తున్నాను. వయస్సు పెరిగినందువలన కొంత శారీ రక పరిపక్వత వచ్చింది. ఇప్పుడు మరింత అందంగా అనిపించింది. మొఖంలో అదే దరహాసం! కళ్లలో అదే చురుకుదనం!



"చాలా కాలమయ్యింది నిన్ను చూసి. ఏమీ మాట్లాడవేంటి?" అంది.

"ముందీ విషయం చెప్పు. నీవిక్కడెందు కుంటున్నావు? ఈ శరణాలయ మేంటి? నీ భర్త ఇంజినీరు కదా. అతనె క్కడుంటున్నారు?" అని ప్రశ్నలు వేశాను.

ఆమె కొంచెం తల దించుకుంది. "నాకసలు పెళ్లయితే కదా భర్త ఉండేది!" అంది నెమ్మదిగా.

నేను అదిరిపడ్డాను. ఏవిటీ, నీకు పెళ్లి కాలేదా? మీ అమ్మగారు చెప్పింది నీ భర్త ఇంజనీరని, మద్రాసులో ఉంటు న్నారనీ..."

"అదంతా నిజం కాదు. మా అమ్మ కావాలనే విశాలమ్మగారికలా చెప్పింది. నాకు పెళ్లయిపోయిందంటే, మీవాళ్లు నీకు పెళ్లి చేసేస్తారని, నాకు అడ్డు తొలగుతుందని అలా చెప్పింది. మా వాళ్లనుకున్నట్లుగానే జరిగింది. నీకు పెళ్లయినట్లుగా రుజువులతో సహా నాకు మా వాళ్లు చూపించారు. మంచి సంబంధం తీసుకొచ్చారు. నేనతన్నే భర్తగా అనుకున్నాననీ మరెవ్వరినీ చేసు కోనని ఖచ్చితంగా చెప్పాను. బతిమా లారు. బెదిరించారు. కానీ చలించలేదు నేను. ఏమీ చేసేది లేక, విరమించుకు న్నారు చివరకు."

నేను నిర్ఘాంతపోయాను. "నీకు పెళ్లయిందని తెలిసి, నేను మరొకర్ని చేసుకున్నాను. కానీ, నా యెడల నిబద్ధ తతో నీవలాగే ఉండిపోయావు. నీ త్యాగం ముందూ, నీ వ్యక్తిత్వం ముందూ నేను మరుగుజ్జులా నిలబ డ్డాను" అన్నాను సిగ్గుపడుతూ.

"అలా అనకు. నీ మనసు నాకు తెలుసు. నీ తల్లీ తండ్రీ ఒత్తిడితో చేసు కున్నావు. వాళ్ల గురించి కూడా ఆలో చించాలి గదా" అంది నన్ను ఓదా రుస్తూ.

"నీకూ తల్లీ తండ్రీ ఉన్నారు కదా! వాళ్ల గురించాలోచించావా నీవు? నీ మనోనైర్మల్యతా, నిబద్ధతా ముందు నేను చాలా బలహీనుడ్ని" అన్నాను.

## అంతా దేవుడిదయ

గోవా చిన్నది జెనీలియా డిసౌజా ఇటు తెలుగు, తమిళం లోనూ అటు హిందీలోనూ వరస విజయాలు సాధిస్తూ తన రేంజ్‌ని పెంచుకుంటూ వెళ్తోంది. అయినా కూడా ఆమెలో కించిత్ అయినా గర్వం కనిపించడంలేదు అంటున్నారు సినీ పరిశీలకులు. ఆ దేవుడు కరుణించబట్టే తను ఇన్ని విజయాలు సాధించగలుగుతున్నానంటోంది. భగవంతుడి కృప తనపై ఇలాగే ఎల్లకాలం వుండాలని ఆయనను ప్రార్థిస్తున్నాను అంటోంది బబ్లీ బబ్లీ జెనీలియా.

"ఛ! అలా అనకు. నీ స్థానంలో ఉన్నావాళ్లెవరైనా అలాగే చేస్తారు. నేనంతా మరచిపోయాను. ఇప్పుడు సంతోషంగానే ఉన్నాను. నా పరిస్థితి ఇలా అయిందని మా అమ్మమ్మ తనది రెండెకరాల పొలం నాకిచ్చింది. మా నాన్న జాలిపడి రెండెకరాలిచ్చారు. ఇలా, ఖాళీగా ఉండే కన్నా ఇతరులకు సాయపడే ప్రయోజనకరమైన పనేదైనా చేయాలనిపించింది. రాజమండ్రి వచ్చాను. నా ఆశయం విన్నాకా, ఒక ధనవంతుడీ స్థలం విరాళంగా ఇచ్చారు. నా పొలం అమ్మేస్తే కొంత డబ్బొచ్చింది. ఈ షెడ్లు కట్టించాను. నేనుండటానికీ చిన్న ఇల్లు ఇక్కడ కట్టుకున్నాను. జీవితంలో దగాపడిన కొందరు స్త్రీలకు ఇక్కడ ఆశ్రయమిస్తాం. వాళ్లకు వృత్తిపనుల నిపుణుల చేత శిక్షణనిప్పిస్తాం. పని నేర్చుకుని, వాళ్లంతట వాళ్లు సంపాదించాలనే నైపుణ్యం వచ్చాకా వెళ్లిపోతారు. ఇద్దరు ముగ్గురు పెళ్లిళ్లు చేసుకుని వెళ్లిపోయారు. కొత్తవాళ్లు చేరుతూ ఉంటారు. ఇక్కడంతా చాలా క్రమశిక్షణతో జరుగుతుంది. జరుగుతున్న పని తీరు చూసి, కొందరు డబ్బున్నవాళ్లు విరాళాలిస్తూ ఉంటారు."

నేనదంతా పట్టించుకోవడం లేదని, ఆమె జీవితం గురించే బాధ పడుతున్నానని ఆమె గ్రహించింది. నన్ను ఉత్సాహపరచడానికి కాబోలు "ఓ రెండు పద్యాలు పాడనా?" అంది నవ్వుతూ.

చెల్లియో చెల్లకో, జెండాపై కపిరాజు పద్యాలు పాడింది. పాటలో అదే శ్రావ్యత! ఆమె కంఠంలోని మాధుర్యం, వయస్సుతో పాటు వగరెక్కి, మరింత మధురమనిపించింది!

ఆ రోజు సాయంత్రం వార్షికోత్సవ సభ ప్రారంభమైంది. పుర ప్రముఖులంతా వచ్చారు. అందరూ ఆమె నిర్వహణ గురించి చాలా మంచిగానే మాట్లాడారు. సభ ముగిసేసరికి చాలా రాత్రయింది. అందరూ వెళ్లిపోయారు.

ఇద్దరం ఆమె ఇంట్లోకి వెళ్లాం. అంత రాత్రివేళ మా ఊరు స్కూటర్ మీద వెళ్లాలంటే కష్టమే! రోడ్డు బావుండదు. ఆ విషయం ఆమెకు తెలుసు. అయినా "వెళ్లొస్తాను" అన్నాను.

ఉండమని ఆమె అనలేదు. ఉండాలని నేనూ అనుకోలేదు. కారణం నాకు తెలుసు. ఆమెకూ తెలుసు!

ఆమె కళ్లలో సన్నటి నీటిపొర కనిపించింది. ఆ నీటి పొర వెనుక ఎంతటి బరువైన బాధ ఉందో నాకు తెలుసు.

మౌనంగానే బైటకు వచ్చేశాను. ఆమె నన్ను గుమ్మం వరకూ వచ్చి సాగనంపలేదు. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. స్థాణువులా అక్కడే నిలబడిపోయింది.

బరువైన మనసుతో ఇంటికి తిరిగి వచ్చాను. మా అమ్మకూ, నా భార్యకూ అంతా చెప్పాను. వాళ్లు చాలా బాధపడ్డారు. నా భార్య, మా అమ్మను వెళ్లి చూసి రమ్మంది. మా అమ్మ మర్నాడే వెళ్లి కోకిల దగ్గర ఓ వారం రోజులుండి వచ్చింది.



★ ★ ★

"అయితే మావయ్యా, నీవప్పుడప్పుడూ వెళుతుంటావా?" అనడిగాను.

"లేదు, ఎంతో అవసరమైన పనుంటే తప్ప వెళ్లను."

"అదేంటి? ఆవిడ అన్నీ మరచిపోయి ఉత్సాహంగా ఉంటోంది కదా. నీవు వెళ్తుంటే మరి కాస్త ధైర్యం ఆమెకు కలుగుతుంది కదా" అన్నాను.

"లేదురా. ఆ ఉత్సాహం, ఆ పరిశ్రమించే జీవితం వెనుక ఎలాంటి శూన్యత ఉందో నాకు తెలుసు. పైగా ఆమె నిష్కల్మషంగా బతుకుతోంది. నేను మళ్లీ మళ్లీ వెళుతుంటే ప్రజలు కథలల్లుతారు. స్వచ్ఛమైన ఆమె వ్యక్తిత్వం మీద మచ్చపడడం నాకిష్టం లేదు. రెండు లక్షలామె పేర బ్యాంకులో డిపాజిట్ చేశాను. అప్పట్లో రెండు లక్షలంటే ఎక్కువే!

ఈ డబ్బులో ఒక్క రూపాయి కూడా ఆశ్రమానికి వాడొద్దు. నీ అవసరానికే వాడుకో. మనిషి జీవితం ఎప్పుడెలా ఉంటుందో చెప్పలేం. నేనెలాగూ నీకు తోడుగా లేను. ఈ డబ్బయినా నీకు కాస్త అవసరానికి సహాయపడొచ్చును" అని చెప్పాను.

'అందర్నీ నవ్విస్తూ, నవ్వుతూ, తుళ్లుతూ ఉండే మావయ్య జీవితంలో ఎలాంటి పరిస్థితులో' అనుకున్నాను.

"మావయ్యా, కోకిల వసంత కాలంలో వస్తుంది. తీయగా పాడి కొద్ది కాలం అలరిస్తుంది. తర్వాతెక్కడికో వెళ్లిపోతుంది. అలాగే కోకిలత్తయ్య నీ జీవితంలోకి వచ్చింది. తన అమాయకమైన ప్రేమతో, స్నేహంతో, ఆత్మీయతతో నిన్ను కొద్దికాలం మురిపించింది. తర్వాత తప్పుకున్నది!" అన్నాను.

మావయ్య మనసులో కోకిల పాట వినిపించినట్లుంది!

"కోకిల మనసుతో పాడుతుంది!" అన్నాడు.

○

## యోగాతో ఎంత హాయో!

శ్రియ తమిళ సినిమాలతో తెగ బిజీగా వుందిప్పుడు. తెలుగులో అవకాశం వస్తే చేస్తానంటున్నా కూడా ఒక్క ఆఫరూ రావడం లేదు. అయితే ఇంత బిజీగా వున్న తనకి ఇటీవలే మొదలెట్టిన యోగా ఎంతో రిలీఫ్‌నిస్తోందని గొప్పగా చెప్పుకుంటోంది శ్రియ. ఆమధ్య హిమాలయాలకు కూడా వెళ్లొచ్చి కాస్త మానసిక ప్రశాంతతని పొందినట్టుగా చెబుతున్న శ్రియ రోజూ క్రమం తప్పకుండా యోగా చేస్తోందిట. షూటింగ్‌లతో టెన్షన్ టెన్షన్‌గా వుండే లైఫ్‌కి ఎంతో ఊరట కలిగిస్తోందిట యోగ. అందుకే అందర్నీ యోగా చేయండి అని సలహా ఇస్తోంది.